క్లుప్తంగా

ఏఓ బాధ్యతల స్వీకరణ



తోటపల్లిగూడూరు : మండల వ్యవసాయాధికారిగా శిరీషరాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా పనిచేసిన గీతాకుమారి జిల్లా రిసోర్స్ సెంటర్‌కు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న శిరీషరాణి మండల ఏఓగా నియమితులయ్యారు. ఈ క్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన శిరీషరాణికి వీఏఏలు, సిబ్బంది స్వాగతం పలికారు.

మెరుగైన సేవలు అందించాలి

కోవూరు: ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఆర్డీఓ మలోల కోరారు. మండలంలోని గంగవరం సచివాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

పొదలకూరు : పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో ఆదివారం రాత్రి పిచ్చికుక్క స్వైర విహారం చేసి ముగ్గురిని కరిచింది. దీంతో స్థానిక యువకులు కుక్కను పట్టుకునేందుకు గస్తీ తిరిగారు. అయితే పిచ్చికుక్క తప్పించుకుని సోమవారం కూడా మరో ఇద్దరిని కాటేసినట్లు స్థానికులు వెల్లడించారు. స్థానిక సీహెచ్‌సీలో బాధితులు వైద్యం చేయించుకున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

ఆగని మోటార్ల చోరీలు

మనుబోలు : మండలంలో విద్యుత్ మోటార్ల చోరీలు ఆగడం లేదు. మనుబోలు పరిధిలోని సర్వే నంబర్ 480/1బిలో ఉన్న అనమాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన పొలంలో మూడు హెచ్‌పీ విద్యుత్ మోటార్, స్టార్టర్‌లను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతు సోమవారం తెలిపాడు. ఇటీవల కాలంలో మనుబోలు పరిధిలో 20 పైగా విద్యుత్ మోటార్ల చోరీకి జరిగాయి.

గ్యాస్ లీకై వంట సామగ్రి దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం: సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాప్తి చెందడంతో వంట సామగ్రితో పాటు ఇంటిపై భాగం దెబ్బతిన్న ఘటన బుచ్చి నగర పంచాయతీలోని ఖాజానగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు రిహానా కథనం మేరకు.. వంట చేస్తుండగా సిలిండర్‌లోని గ్యాస్ పూర్తవడంతో మరో సిలిండర్‌ను మార్చారు. అయితే స్టౌవ్‌ను ఆఫ్ చేయకపోవడంతో కొత్త సిలిండర్‌ను బిగించిన తర్వాత స్టౌవ్ వద్ద నుంచి గ్యాస్ లీకైంది. దీనిని గుర్తించడకుండా లైటర్‌ను ఆన్ చేయగానే ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో ఆమె ఒక్కసారిగా వంట గది నుంచి పరుగులు పెట్టింది. ఇంతలో మంటలు వ్యాపించడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రిహానా ఇంట్లోని వంట పాత్రలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

జగనన్నకు చెబుదాం..
పరిష్కరించుకుందాం

- పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ప్రజలు
- నిర్ణిత గడువులోపు పరిష్కరిస్తామని హామీ



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు హజరత్తమ్మ. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగాయగుంట. గతంలో ప్రభుత్వం అసైన్డ్ కింద 15 సెంట్ల భూమి ఆమెకు వచ్చింది. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని ఆమె వాపోయింది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చంటి బిడ్డతో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చి అర్జీని అందజేసింది.



బుచ్చిరెడ్డిపాళెం : అర్జీదారుల సమస్యలు వింటున్న తహసీల్దార్ సుధీర్

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలుపుకొని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సుధీర్ సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా అన్ని శాఖలకు సంబంధించి 12 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్యామ్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిది అర్జీల స్వీకరణ

కోవూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మజ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ఎనిమిది అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఎంపీడీఓ శ్రీహరి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి స్పందన

ముత్తుకూరు : మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్‌ఓ వాసుదేవ్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, ఎంఈఓ మధుసూదన, వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అర్జీలను తక్షణం పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

సత్వరమే పరిష్కరిస్తాం

వెంకటాచలం : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు. వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఇందులో ఆరు రెవెన్యూ, ఒక ఇరిగేషన్, ఎంపీడీఓ కార్యాలయానికి సంబంధించి మరో అర్జీతో కలిపి మొత్తం ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిలో రెండు రైస్ కార్డులకు సంబంధించిన అర్జీలను వెంటనే పరిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఐదు అర్జీల స్వీకరణ

పొదలకూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మొత్తం ఐదు అర్జీలు వచ్చాయి. అన్నిశాఖల అధికారులు పాల్గొన్న కార్యక్రమంలో మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన ఎస్సీలు తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందజేయాల్సిందిగా తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి మేత, కొండ, చెరువు పొరంబోకు అయితే పట్టాలు పంపిణీ చేసేందుకు వీలుపడదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్ బాబు, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్, ఇరిగేషన్ ఏఈలు కె.కసనానాయక్, ప్రసాద్, శివమోహన్, జానకిరామిరెడ్డి, ఏపీఎం రోజ్‌మేరీ, ఏపీఓ మధుసూదన్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



ముత్తుకూరు : సమస్యలు వింటున్న అధికారులు



వెంకటాచలం : తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అర్జీదారులు



పొదలకూరు : అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం



చినజీయర్ స్వామిని ఆహ్వానిస్తున్న మంత్రి కాకాణి, ఈఓ జనార్దనరెడ్డి

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో పునర్నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే వేడుకలకు శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఈఓ జనార్దనరెడ్డి సోమవారం కలిసి ఈ మేరకు ఆహ్వానించారు.

గడ్డివాముల దగ్ధం



వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి గ్రామంలో ఆరు గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రవీంద్ర, కిరణ్, గుండుబోయిన బుజ్జమ్మ, పుట్టయ్య, మరో ఇద్దరు రైతులకు చెందిన గడ్డివాములు పక్కపక్కనే ఉన్నాయి. అయితే సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకునే సరికే ఆరు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది ఇతర గడ్డివాములకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. గడ్డివాములు కాలిపోవడానికి కారణాలు తెలియలేదని స్థానికులు చెబుతున్నారు. రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటయ్యేలా పనులు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

- డ్వామా పీడీ వెంకటరావు

పొదలకూరు : ఉపాధి హామీ కూలీలు కనీస వేతనం రూ.257 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని డ్వామా పీడీ డి.వెంకటరావు సూచించారు. మండలంలోని చాటగొట్ల గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను పీడీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో కూలీలకు రూ.230 వస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.257 వరకు పెంపొందించుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఏపీఓ మధుసూదన్ ఉన్నారు.



కొడవలూరు: కమ్మపాళెంలో పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

వేసవి జాగ్రత్తలు తప్పనిసరి

కొడవలూరు: ఉపాధి కూలీలు వేసవి జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. మండలంలోని కమ్మపాళెంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి కూలీలకు పలు సూచనలిచ్చారు. ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 10 గంటలకు ముగించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎఫ్ఏ ఎ.ప్రభాకర్, మేట్ కె.నాగేశ్వరరావు ఉన్నారు.

మనుబోలులో వైద్యశిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

మనుబోలు : శ్రీసేవానాథం ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరు నారాయణ ఆస్పత్రి సహకారంతో మనుబోలు బాలుర వసతిగృహంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు తరిష్మా, రోహిత్, మహేష్ కలిసి సుమారు 300 మంది రోగులను పరీక్షించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సచివాలయ సేవలు వినియోగించుకోండి

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

మనుబోలు: సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. మనుబోలు, పిడూరు సచివాలయాలను సోమవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ లక్ష్యంతో అయితే సచివాలయాలను ప్రారంభించిందో అది నెరవేరేలా సేవలందించాలన్నారు. ఆధార్ నమోదు చేసుకుని 10 సంవత్సరాలు దాటిన వారు తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులను క్రమం తప్పకుండా బరువులు కొలిచి తక్కువ బరువున్న వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం ఒక బృందంగా ఏర్పడి అంగన్‌వాడీల్లో చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించి అనంతరం వారి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

- పిడూరు గ్రామంలో ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో నమోదు చేసుకుంటూ పక్కాగా సర్వే చేయాలని వలంటీర్లకు పీడీ సూచించారు. సచివాలయ సేవలకు సంబంధించి పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడంతో అధికారులతో సమీక్షించారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి వివిధ రకాల సర్టిఫికెట్లను అవసరమైన వారికి జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి కృష్ణవేణి, మహిళా పోలీస్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిరిమానోత్సవం



సిరిమానును లాగుతున్న భక్తులు

- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాముండేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం(రథోత్సవం) సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలతో రథాన్ని గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. సిరిమానును లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. తొలుత అమ్మవారికి పూలంగి సేవ జరిగింది. అర్చకులు నూతలపాటి అనిల్‌కుమార్‌శర్మ, మాచవోలు రామకృష్ణ, ముప్పిరాల కిశోర్, యాజ్ఞికులు మన్నూరు మల్లికార్జున గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక విష్ణుప్రియాత్ భారీ ప్రసాద వితరణలు చేపట్టారు. ఉదయం తీర్థవాది సముద్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

భక్తుల కోలాహలం..

రథోత్సవం(సిరిమానోత్సవం)ను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో గ్రామంలోని వీధులు, రహదారులు జనంతో కిటకిటలాడాయి. ప్రతి ఏడాదిలానే రథోత్సవం అనంతరం నిప్పుల గుండం కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.



భారీగా తరలివచ్చిన భక్తులు

నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో చివరిదైన తెప్పోత్సవం మంగళవారం రాత్రి జరుగనుంది. ఆలయం వెనుక వైపు ఉన్న కోనేరులో జరిగే కార్యక్రమానికి ఏర్పాట్లను పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పూర్తి చేశారు.

మంత్రి కాకాణి పరామర్శ



మనుబోలు : అక్కంపేట మాజీ సర్పంచ్, ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కిరణ్ గాయపడి చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని ఆయన నివాసంలో ఉండగా మంత్రి వెళ్లి పరామర్శించారు.

రేషన్ దుకాణంపై విజిలెన్స్ దాడులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లో ఐదో నంబర్ రేషన్ దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి దాడులు జరిపారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుకాణ యజమాని పరమేశ్ అవకతవకలకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదు రావడంతో దాడులు చేశామన్నారు. ఉండవలసిన బియ్యం కంటే 30 బస్తాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, దీనిపై కేసు నమోదు చేశామన్నారు. సివిల్ సప్లైయ్స్ అధికారి మురళీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఇందుకూరుపేట : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్ నుంచి తోటపల్లిగూడూరు మండలం కోడూరు బీచ్ వరకు 13.5 కిలోమీటర్ల మేర 300 మంది పోలీసులు, 210 మంది మహిళా పోలీసులు, గీతాంజలి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్లాస్టింగ్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సముద్రం మనల్ని కాపాడుతోందని, దీనిని పరిరక్షించుకోవాలన్నారు. సందర్శకులు తీరం వెంబడి చెత్తా చెదారం వేయకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఇక్కడ టూరిస్ట్ పోలీసు సేవలు ప్రారంభించామని, ఎప్పుడూ భద్రత ఉంటుందన్నారు. అనంతరం ఆయన బీచ్‌లో మొక్కను నాటారు. కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులు, పోలీసులకు విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ హిమవతి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, క్రైమ్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్ రావు, డీఎస్పీలు వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఏఆర్ డీఎస్పీ గాంధీ, కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి, పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్లాస్టిక్ అనర్థాలపై గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను పెంచడంతో పాటు నీటి వృథా చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ టి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు ఎస్.నర్మద, కళాశాల డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత

కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలతో విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నార్తురాజుపాళెంలో పర్యావరణ పరిరక్షణపై కళాజాత ప్రదర్శన ఇచ్చారు. నీటిలో ప్లాస్టిక్ కరగదని, దీనిని కాల్చడం వల్ల విషవాయువులు బయటకొచ్చి గాలిని కాలుష్యం చేసి అనేక రోగాలకు మూలమవుతాయని హాస్య ప్రదర్శనతో చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో శివశంకర్, శశిరేఖ, ప్రసాద్ పాల్గొన్నారు.

పరిరక్షించుకుందాం

కోవూరు (విడవలూరు): ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుజాత అన్నారు. విడవలూరులోని కళాశాల ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మప్రియ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

ముత్తుకూరు : ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోర్టులో సోమవారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. సీఓఓ సంజయ్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, వేణుగోపాల్, వెంకటేష్ భాస్కరన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వాయు ఉద్గారాలు తగ్గించాలి – జెన్‌కో సీఈ

గ్లోబల్ వార్మింగ్‌ను అదుపులో ఉంచడానికి వాయు ఉద్గారాలను తగ్గించాల్సిన అవసరం ఉందని నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్టు సీఈ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా జెన్‌కోలో ఉద్యోగులతో కలిసి 500 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ విభాగాల ఎస్ఈలు, జీఎం(హెచ్ఆర్), ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ తదితర ఇంజినీర్లు పాల్గొన్నారు.

కోడూరు బీచ్‌లో క్లీన్ అండ్ గ్రీన్

తోటపల్లిగూడూరు : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌లో సీపీ ఆక్వా కంపెనీ యాజమాన్యం సోమవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీ ఆక్వా కంపెనీ చేపట్టిన సేవా కార్యక్రమంలో ముత్తుకూరు ఫిషరీస్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రమంలో బీచ్‌లోని చెత్తా చెదారాలతో పాటు వ్యర్థాలను తొలగించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై స్థానికులు, పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంపెనీ డిపార్ట్‌మెంట్ మేనేజర్ సంటి మోంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీఎస్సార్ ఆఫీసర్ నరేష్, హెచ్ఆర్ హెడ్ శ్రీహరి, ముత్తుకూరు ఫిషరీస్ కళాశాల డీన్ డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : మైపాడులో మొక్క నాటుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



ఇందుకూరుపేట : పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



ముత్తుకూరు : పోర్టులో మొక్క నాటుతున్న సీఈఓ



కొడవలూరు : నార్తురాజుపాళెంలో..



కొడవలూరు : కళాజాత ప్రదర్శన



కోవూరు : మొక్కలు నాటుతున్న విద్యార్థులు



తోటపల్లిగూడూరు : కోడూరు బీచ్‌లో..